# అనంతం

"అమ్మా! నేలలా గుడికిపోయొస్తాను - పురాణకాలక్షేపం జరుగుతున్నది!" సంకోచిస్తూ చెప్పాడు బయటకు పోయేముందు అనంతరామయ్య - కోడలివంక చూసి.

"ఎందుకు - టివీ పెట్టుకుంటే సరిపోదా?" కోడలు సౌమ్య మొహం చిట్లించింది యిష్టంలేనట్టు.

"పెద్ద వయసు కదమ్మా! టీవీ ఎక్కువ సేపు చూసినా కళ్ళు లాగుతాయి - అందుకని అలా చల్లగాలికెళ్ళి - ఏవోనాలుగు మంచి మాటలు చెవినేసుకుందామని -" నసిగారు కోడలుకు గట్టిగా ఎదురుచెప్పే ధైర్యం చాలక నచ్చచెబుతూ.

"చాల్లేండి - పెద్దవారు మీకు కూడ చెప్పాలా మామయ్యగారు! గట్టిగా శ్రమపడవద్దని డాక్టర్లు చెప్పలేదూ? ఎక్కడికి పోవద్దు - యింట్లో రెస్టు తీసుకోండి." కసిరింది.

"ఏమ్మా? మీరెక్కడికన్నా పోయేదుందా?" నిదానంగా అడిగారు కోడల్ని చూస్తూ.

"అవునండి - వారి బాస్ డిన్నర్ యిస్తున్నారట! ఇద్దరం వెళ్ళాలి - పిల్లల్నితీసుకుపోతే నానా అల్లరి చేస్తారు - పరువు పోతుంది - అందుకని స్వాతిని, వేణుని వదిలేసి వెళతాం - మీరుంటారన్న ధైర్యంతో పనిమనిషిని కూడ ఉండమని చెప్పలేదూ - " చెప్పింది సౌమ్య సాధ్యమైనంత సౌమ్యంగా - మొహంలో మటుకు చెప్పలేనంత విసుగు కనిపిస్తున్నది.

"సరేలేమ్మా! వెళ్ళిరండి - యింటికి కాపలానే వుంటాను - మనవడ్ని - మనవరాల్ని చూసుకుంటూ వుంటాను." మనసులో బాధపడ్తూనే బయటకు నవ్వుతూ అన్నారు అనంతరామయ్య.

"రేపు పోదురు కానిలేండి పురాణానికి - ఒకరోజుతో అయ్యేదా అది?" ఓదారుస్తూ చెప్పింది.

"ఎందుకులేమ్మా రేపు గురించి ఆలోచన? పండుటాకును - ఏమవుతుందో!" విసురుగా అనేసి తన గదిలోకి వచ్చేశారు.

ఈమధ్య సౌమ్య ప్రవర్తన, శీను ప్రవర్తన చిత్రంగా వుంది. తనని కేవలం యింటికి కాపాలదారుడిగా - పిల్లల్ని చూసుకునే ఆయాగా భావిస్తున్నట్లున్నారు. కొడుకు ఆఫీసరైం దగ్గర్నుండి వీళ్ళ తిరుగుళ్ళు ఎక్కువయ్యాయి.

ఓ అరగంటలో కొడుకు, కోడలు బయటకి వెళ్ళిపోయారు, స్వాతిని, వేణును తాత దగ్గర వదిలిపెట్టి.

"తాతా! నువ్వు డిన్నర్‌కు వెళ్ళవా?" వేణు అడిగాడు - ఆరేళ్ళుంటాయి వాడికి. అన్నీ ప్రశ్నలే వాడిబుర్రలో.

"తప్పు అలా అడక్కూడదు?" ఏడేళ్ళ స్వాతి కోప్పడింది తమ్ముడ్ని.

"మీరెందుకు వెళ్ళలేదు?" అనంతరామయ్య ఎదురుప్రశ్న.

"మరే –మేమేమో అల్లరి చేస్తాంగా – నువ్వు కూడా అల్లరి చేస్తావా?" వేణు సందేహం!

"ఆ! బాబూ! నేను కూడ మీ అమ్మానాన్నల దృష్టిలో అల్లరి పిల్లాడినే!" భారంగా నిట్టూరుస్తూ చెప్పారు.

"ఛీ! ఎక్కడైనా పెద్దాళ్ళు అల్లరిచేస్తారా?" స్వాతి అనుమానం.

"తాతయ్య! ఓ కథ చెప్పవూ?" వేణు మారాం చేశాడు.

"చెప్పు–చెప్పు–భలే వుంటుంది కథ" స్వాతి అడిగింది.

అనంతరామయ్య ఓ క్షణం ఆలోచించారు – తర్వాత కళ్ళు తెరిచి చెప్పడం ప్రారంభించారు. వేణు, స్వాతి చెవి కోసుకునేట్లు వింటున్నారు.

"ఇది చాలా పాత కథ! మీ టీచర్లు చెప్పి వుండచ్చు. ఇంకెవరైనా చెప్పి వుండచ్చు. కానీ, మంచి కథ ఒకటికి రెండుసార్లు విన్నా నష్టం లేదు." ఉపోద్ఘాతం.

"తాతయ్య! అస్సలు కథ చెప్పు." ఇద్దరూ.

"ఈ సృష్టి విధాత – బ్రహ్మదేవుడు – అందరినీ సృష్టించి ఆయుష్షు పోసి భూలోకంలో వదిలాడు. బ్రహ్మ అందరికీ ఒకే విధంగా ఆయుర్దాయం యిచ్చాడు. అంటే ఉదాహరణకు మనిషికి, గాడిదకు, కుక్కకు, గుడ్లగూబకు – యిలా అందరికి నలభై సంవత్సరాల ఆయుర్ధాయం యిచ్చాడు. తన నిష్పక్షపాత బుద్ధికి మురిసిపోతూవుండేవాడు."

ఓరోజు బ్రహ్మ దగ్గరికి మనిషి, గాడిద, కుక్క, గుడ్లగూబ పరుగెత్తుకుంటూ వచ్చాయి – " గుక్క తిప్పుకోవడానికి ఆగారు అనంతరామయ్య.

"తాతయ్య! బ్రహ్మ మనకి కనపడ్డుగదా – మరి. వీళ్లు ఆయన దగ్గరికి ఎలా వెళ్ళారు." వేణుకు అనుమానం వచ్చింది వెంఠనే!

"విమానంలో వెళ్ళారా?" స్వాతి ప్రశ్న.

"కాదు – ఒకప్పుడు ఆకాశం – భూమి కలిసి వుండేవి. దేవలోకంలోంచి దేవతలు భూమి మీదకు వచ్చేవాళ్ళు. భూలోకంలోనుండి భూచరాలు దేవలోకంలోకి వెళ్ళేవి! మరి కథ చెప్పనా వద్దా – మీరిలా పిచ్చి ప్రశ్నలు అడగకూడదు మధ్యమధ్యలో – ఓకే!" అనంతరామయ్య చెప్పారు.

"సరే తాతయ్య చెప్పు" పిల్లల కోరస్!

"బ్రహ్మ నరుడ్ని, గాడిదను, కుక్కను, గుడ్లగూబను ఎగాదిగా చూశాడు – 'ఏమిటీ మీ సమస్య' అని అడిగాడు. ముందు నరుడు చెప్పాడు. 'ఓ విధాత! సృష్టిలో అత్యంత ఉత్తమ ప్రాణి మనిషి! అన్ని జీవరాశులకంటే అతనికి తెలివి – భాష – వివేకం యిచ్చావు

– నీ రూపంలో అతన్ని సృష్టించావు – కానీ, అతనికి ఆయుర్దాయం మటుకు కేవలం నలభై సంవత్సరాలే యిచ్చావు. ఇంత తక్కువ జీవితంలో అతను ఏం సాధించగలడు? విద్యాబుద్ధులు గడించడానికే సగం జీవితం ఖర్చు అయిపోతున్నది. ఉద్యోగాన్వేషణలో యింకొన్ని సంవత్సరాలు వృధా అయిపోతున్నాయి – తీరా జీవితం అనుభవించడం మొదలుపెట్టేసరికి అతన్ని మృత్యువు కబళిస్తున్నది. ఇదేం బాగోలేదు – మనిషి ఆయుర్ధాయాన్ని పెంచమని ప్రార్థిస్తున్నాను.' అని మొర పెట్టుకున్నాడు. అప్పుడు బ్రహ్మ మనిషి పేరాశకు తనలో తాను నవ్వుకున్నాడు."

పిల్లలు కళ్ళు చెవులు అప్పగించి శ్రద్ధగా వింటున్నారు.

"ఇంతలో గాడిద తన గోడు చెప్పుకుంది. 'స్వామీ! నాది గాడిద బతుకు – జీవితమంతా మనిషి చేత తన్నులు తింటూ అతను వేసే బట్టలు, వస్తువులు – మోసుకుంటూ బ్రతుకంతా భారంగా వెళ్ళదీస్తున్నాను. ఈ వెట్టి చాకిరికేనా నాకు నలభై సంవత్సరాల బతుకు నిచ్చావు – నాకు అంత ఆయుష్షు వద్దు – సగానికి సగం తగ్గించెయ్యి. కన్నీటితో చెబుతున్న గాడిదను చూసి బ్రహ్మ నాలుగు బుర్రల్ని నాలుగుచేతుల్తో గోక్కున్నాడు." చెప్పారు.

"పాపం! నాకు ఒక్క తలకాయ గోక్కోడమే కష్టంగా ఉంది." వేణు జాలిపడ్డాడు.

"తప్పు. దేవుడు అలా అనకూడదు." స్వాతి కోప్పడింది.

"గాడిద ఏడ్పు ఆపిందో లేదో కుక్క కుయ్యోమొర్రో అని ఏడవడం మొదలెట్టింది. బ్రహ్మ దానివంక ప్రేమగా చూసి అడగ్గా వివరించింది. ప్రభూ! విశ్వాసానికి మారుపేరును నేను. ఈ మనిషి పెట్టింది తింటూ యితని యిల్లు కాపలా కాస్తూ వుంటాను. రాత్రి అతని యింటికి దొంగలురాకుండా రక్షిస్తూవుంటాను. అంతేకాదు – అతను చెప్పినట్లు వింటూ విశ్వాసంగా ఉంటూ తోకాడించుకుంటూ అతని చుట్టూ తిరుగుతూంటాను. కానీ, నాకు గుప్పెడు మెతుకులు పెట్టడం దండగనుకుంటాడు ఈ మనిషి. నా విశ్వాసానికి తగిన ప్రతిఫలం యివ్వడు. కోపం వచ్చినప్పుడల్లా కొడుతూ వుంటాడు – గొంతెత్తి పాడుకోవడానికి లేదు – అతనికి నిద్రాభంగమవుతుందని నాలుగు తగిలిస్తూ వుంటాడు. ఇలా యింకోళ్ళమీద ఆధారపడి బతికేనాకు నలభై సంవత్సరాల ఆయుర్ధాయం ఎందుకు ప్రభూ! ఇరవై ఏళ్ళకే నాకు మరణం ప్రసాదించండి. అంటూ భౌ భౌ మని విలపించింది. చతుర్ముఖుడు నాలుగు తలల్ని పంకించాడు." అనంతరామయ్య చెప్పారు ఆయాసపడ్తూ.

"పాపం! కుక్కని ఎప్పుడూ కొట్టకురా!" స్వాతి తమ్ముడ్ని మందలించింది.

"మరే! కరుస్తుందేమోనని రాయితో కొడతాను" వేణు చెప్పాడు.

"కుక్క చాలా మంచిది – తాతయ్య తర్వాతేమైంది?"

"గుడ్లగూబ అరిచింది. ఆ అరుపుకు బ్రహ్మ ఉలిక్కిపడి విసుక్కున్నాడు. 'ఛీ! ఛీ! ఏవిటాకూత!' అంటూ అప్పుడు ఆ గుడ్లగూబ తన బాధ యిలా చెప్పుకుంది. 'తండ్రీ!

నన్నెందుకు పుట్టించావు? జన్మనిచ్చి నాకెందుకు ద్రోహం చేశావు. సకల జంతుజాలం పగలు హాయిగా విహరిస్తూ వుంటాయి. సూర్యుడి బంగారు కిరణాల్లో ఆడుకుంటూ తిరుగుతూంటాయి. కానీ, నేను దివాంధురాల్ని! పగలు కళ్ళు కనపడవు. రాత్రల్లా కాపలాకాసి నా ఆహారం సంపాదించుకోవాలి. నన్ను చూస్తేనే దుశ్శకునంగా భావించి ఛీ కొడతారు - అటువంటి నాకెందుకు ఈజన్మ? జన్మ యిస్తేయిచ్చావు - అందరికిలాగా నాకు నలభై సంవత్సరాలు ఆయుష్షు యిచ్చావు. ఏం చేసుకోవాలి? అందరితో తిట్లు తింటూ దుర్భరమైన జీవితం గడపడానికా? నాకు యిరవై సంవత్సరాలు చాలు - అంటూ ఏడ్చేసింది. ఆ మాటలకు బ్రహ్మ శివశివ అంటూ ఎనిమిది చెవులు మూసుకున్నాడు."

"బ్రహ్మదేవుడు విషమ పరిస్థితిలో పడ్డాడు. ముందుగా నిర్ణయించిన ప్రకారం అందరికీ సమంగా ఆయుర్దాయం పోశాడు. ఇప్పుడేమో మానవుడు ఎక్కువ సంవత్సరాలు కావాలంటున్నాడు - ఖరం, శునకం, ఉల్లూకం యిచ్చిన సంవత్సరాలు వద్దంటున్నాయి. సృష్టిలో సమతూకం చెడిపోతుంది. ఎనిమిది దిక్కుల్లో ఒక్క దిక్కు తోచక నాలుగు ముక్కులతో నిట్టూర్చాడు." చెప్పారు.

"అప్పుడు మనిషి ఏం చేశాడు?" వేణు అడిగాడు.

"నరుడు ముందుకు వచ్చాడు. 'ఓ విధాతా! గాడిద వద్దంటున్న యిరవై సంవత్సరాలు, కుక్క వద్దన్న ఇరవై సంవత్సరాలు, గుడ్లగూబ వదిలిపెట్టిన యిరవై సంవత్సరాలు నాకివ్వండి - నాకిచ్చి నా అయుష్షను నూరు సంవత్సరాలుగా చేయండి.' అని ప్రార్థించాడు."

సమస్య యింత తొందరగా పరిష్కారమయిందానికి బ్రహ్మ దేవుడు సంతోషించి 'తథాస్తు' అన్నాడు. అందరూ ఆనందంగా భూలోకానికి తిరిగి వచ్చేశారు." చెప్పారు.

"అయితే తాతయ్య మనిషి ఆయుర్దాయం నూరు సంవత్సరాలా?" స్వాతి అడిగింది.

"ఆ! మనిషినూరు సంవత్సరాలు బతికినా - తనకోసం బతికేది నలభైసంవత్సరాలే! ఈ నలభై సంవత్సరాల్లోనేనమ్మా మనిషి సంతోషంగా, సుఖంగా తన యిష్టమొచ్చినట్లు జీవితం గడిపేది."

"తర్వాత!" వేణు ప్రశ్న!

"నలభైనుండి అరవైదాకా వచ్చిన ఆయుష్షు అతనిదికాదు - గాడిదది. అందుకే గాడిదలాగా ఈ యిరవై సంవత్సరాలు బాధ్యతలు మోస్తూ వుంటాడు. సంసార బాధ్యతలు మోస్తూ వుంటాడు. ఈ పీరియడ్‌లోనే పిల్లల పెళ్ళిళ్ళు, ఉద్యోగాలు, యిల్లు కట్టుకోవడం వగైరా గాడిద చాకిరి చేస్తాడు."

"పాపం! గాడిద బరువు!" స్వాతి అంది.

"తర్వాత - ?" వేణు.

"ఏముంది - తర్వాత కుక్క బతుకు! కుక్కలా విశ్వాసంతో యిల్లు కాపలా కాస్తూ

వుంటాడు. తను సంపాదించిన ఆస్తి ఎవరు కాజేయకుండా కాపలా కాస్తూ వుంటాడు. కూతుళ్ళకు, కొడుకులకు, కోడళ్ళకు, అల్లుళ్ళకు విశ్వాసపాత్రంగా మెలుగుతూ వుంటాడు. కుక్కని కసిరికొట్టినట్లు కసిరికొట్టినా యిల్లు విడిచి పోలేక - చూరు పట్టుకువేలాడుతూ వుంటాడు." బాధగా చెప్పారు.

"మరి ఈ ఆయుర్ధాయం కుక్కది కదా!" వేణు అన్నాడు.

"ఆ తర్వాత ఏముంది తాతయ్యా!"

"ఎనభైనుండి నూరు సంవత్సరాల దాకా అందరిచేతా ఛీ కొట్టించుకుని బతకలేక బతుకుతాడు. కళ్ళు కనపడవు. ఒంట్లో శక్తి వుండదు. చావూ రాదు. అందరికీ యిబ్బందే! ఎదురు వస్తే చాలు తిట్టుకుంటారు. అలాగే గుడ్లగూబ బతుకు బతికేస్తూవుంటాడు." కళ్ళు తుడుచుకుంటూ చెప్పాడు అనంతరామయ్య.

"తాతయ్యా! మనిషి అలా బ్రహ్మను అడిగి వుండాల్సిందికాదు." స్వాతి బాధగా చెప్పింది.

"ఆశ - దోశ - అప్పడం - అందుకే అలా అయింది." వేణు.

"ఆ! నిజంగా ఆశే! మనిషికి పేరాశ! ఏం బావుకుందామనో రోజురోజుకు అందరి ఆయుష్షుపోసుకుని బతుకుతున్నాడు! బ్రహ్మయ్య మనిషి ఆయుర్ధాయ పెంచకుండా ఉన్నా బాగుండేది." కళ్ళు తుడుచుకుంటూ చెప్పారు.

"తాతయ్యా! ఇప్పుడు నీ వయస్సెంత?" స్వాతి.

"అరవై ఆరు." లెక్కచూసుకుంటూ చెప్పారు.

"ఆ! ఇప్పుడు నీది కుక్క బతుకు." వేణు చప్పట్లు చరుస్తూ అన్నాడు.

"ఛీ! తాతయ్యని అలా అనకూడదు - " స్వాతి చెప్పింది.

ఇంతలో కారు ఆగింది.

ముగ్గురూ ఆశ్చర్యంగా చూశారు.

కారులోంచి శీను దిగాడు. నడుచుకుంటూ వచ్చాడు.

"ఏరా! అప్పుడే పార్టీ అయిపోయిందా? కోడలు ఏది?" అనంతరామయ్య అడిగారు కొడుకును చూస్తూ.

"నాన్న! పార్టీ యింకా కాలేదు." ఆగాడు సందేహిస్తూ.

"మరి నువ్వొచ్చావేం నాన్న?" స్వాతి అడిగింది.

"మమ్మీని వదిలేసి వచ్చావా డాడీ? తాతయ్య మాకు భలే భలే కథలు చెబుతున్నాడు. మరే తాతయ్యదే కుక్క బతుకుట!" వేణు గంతులేస్తూ చెప్పాడు.

"ఛీ! ఛీ! ఏవిటామాటలు కళ్లుపోతాయి." శీను ఒక్కటిచ్చాడు వేణు వీపుమీద.

"చిన్న పిల్లాడు వాడికేం తెల్సు?" తలవంచుకుని అన్నారు. "వాడ్ని అనవసరంగా కొట్టమాకు."

"నాన్నగారు! మీరూ పార్టీకి రావాలి - పిల్లలూ మీరు కూడ - తయారుకండి." శీను చెప్పాడు.

అనంతరామయ్యగారు తన చెవుల్ని తను నమ్మలేకపోయారు. శీను ఎప్పుడూ తనతో పరాచికాలాడలేదు.

"నాన్న మేం రెడీ!" పిల్లలు తయారయ్యారు.

"బాబూ! మీరు వెళ్ళిరండి - ఇంటికి నే కాపలా వుంటాను. ఎవర్రూ లేకపోతే బావుండదు. రోజులు అసలే బాగోలేవు." ముభావంగా చెప్పి కుర్చీలో కూర్చున్నారు.

"నాన్న! నేను మీ కోసమే వచ్చింది. మిమ్మల్ని తప్పకుండా తెమ్మన్నారు." అసలు విషయం చెప్పాడు.

"ఎవరు బాబు నామీద అంత ప్రేమ చూపిస్తున్నది?" వ్యంగ్యంగా అన్నారు.

"ప్రేమలేదు గీమలేదు - మీరు వస్తున్నారు - రండి." కోపంగా చెప్పాడు శీను.

"నేరాను - నాకిష్టంలేదు - నువ్వెళ్ళు!" కటువుగా చెప్పారు. ఇంత సద్బుద్ధి కోడలికి కలిగిందో - కొడుక్కు కలిగిందో తెల్సుకోవాలనుకున్నారు - కాని, యింతలోనే శీను గాడి చిరాకు. తనకు పుట్టినవాడికే యింత చిరాకయితే తనకెంత ఉండాలి. పురాణం కాస్తాపోయింది, తను తినే నాలుగు మెతుకులకోసం ఆ పార్టీకేం పోనక్కరలేదు

శీనుకు పచ్చి వెలక్కాయ గొంతులో పడ్డట్టయింది. ఇందాక జరిగిన సంఘర్షణ గుర్తుకొచ్చింది.

బాస్ తన తండ్రి రామారావుగార్ని పరిచయం చేశాడు. యథాలాపంగా రామారావుగారు శీను పుట్టుపూర్వోత్తరాలు - పెరిగిన ఊరు కనుక్కున్నారు. ఆనందం పట్టలేక శీను భుజాలు చరిచారు.

"ఓరి నువ్వటోయ్ శీనూ! నువ్వు మా అనంతంగాడి పుత్రరత్నానివ్వన్నమాట! చాలా సంతోషం! అనంతం బావున్నాడా? చిన్నప్పుడు ఏమి ఏడిపిస్తూ వుండేవాడు మమ్మల్ని - ఇంతకు యింత అనుభవించి వుంటాడు - అది సరే - మీ నాన్నగార్ని, అమ్మగార్ని పిల్లల్ని తీసుకురాలేదేం?" ఆయన ప్రశ్న.

ఏం చెబితే ఏమొస్తుందేమోనన్న సందేహంతో బాస్ వంక చూశాడు. అతను తనకేం పట్టనట్టు ఎటోచూస్తున్నాడు. చివరికి అబద్ధం ఆడాడు. "కొంచెం నలతగా వుంటే నాన్నగారు రాలేదు."

"అయ్యో! అనంతంకు బాలేదా? హార్రీ! పిడుగులా వుండేవాడు - కనీసం అమ్మను తీసుకురాపోయావూ?"

"నాకాదృష్టంలేదు - ఆమె లేరు." నిదానంగా చెప్పాడు.

రామారావుగారు షాక్ తిన్నారు. ఆయన చాలా బాధపడిపోయారు. "నేను వెంటనే అనంతరామయ్యను చూడాలి - ఒరే గోపీ! నేను వాడి దగ్గరికి వెళతాను. డ్రైవర్ని పంపు." చిన్న పిల్లాడిలా మారాం చేశారు.

"నాన్న! ఇంత చిన్న విషయానికి మీరెందుకు వెళ్ళడం - ఆయన్నే పిలిపిస్తాను. మిమ్మల్ని చూసినట్టు వుంటుంది - పార్టీకి వచ్చినట్టు వుంటుంది." బాస్ చెప్పాడు.

"కరెక్ట్! కరెక్ట్! నేను పట్టుకొస్తాను." శీను అన్నాడు.

"మరి అనంతకు నలతగా వుందన్నావ్?" రామారావు ప్రశ్న.

"ఫర్లేదు- మీకోసం వస్తారు." బుకాయించాడు.

"ఐసీ! మా స్నేహం అటువంటుది - మరి తీసుకురా!"

"యస్ మిష్టర్ శీను! మీ ఫాదర్ని, పిల్లల్ని వెంఠనే పట్టుకురా!" బాస్ ఆర్డర్!

శీనుకు చెమటలు పోశాయి. ఇప్పుడు తండ్రిరానంటున్నాడు. ఏం చెయ్యాలి? నలుగురిలో పరువు పోతుంది.

"నాన్న! నన్ను క్షమించు. పార్టీకి పిలిచింది నేను కాదు - మీ రామారావు!" జరిగింది చెప్పాడు దాచకుండా.

"శీనూ! పదరా వస్తాను!" పైకి అన్నారు కాని స్వగతంగా యిలా అనుకున్నారు. 'నా విలువ మీకు తెలీకపోయినా నా స్నేహితుడికి తెల్సురా! ఆ రామారావుగాడు కనీసం తనమాటకు విలువనిచ్చే కొడుకును కన్నాడు - నేను మటుకు కోడలు మాట జవదాటని వాడ్ని కన్నాను. అయినా భరించక తప్పదు - ఈ జీవితాన్ని! ఎప్పుడైనా వచ్చే యిటువంటి ఆనందపు క్షణంకోసం ఎదురు చూస్తూ ఈ అనంత దుఃఖాన్నంతా భరించాలి.' ఆనంద భాష్పాలు రాలాయి ఆయన కండ్లనుండి.

**( ఆకాశవాణి సౌజన్యంతో 1995 )**